ప్రజా పాలన సేవా కేంద్రాలు ఏర్పాటు

కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, జూలై18 : ప్రజా సమస్యలను వివరించడానికి, పరిష్కారానికి ప్రజాపాలన సేవాకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ మను చౌదరి తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని నేషనల్ ఇన్ఫర్మేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ప్రారంభించారు. జిల్లాలో 23 మండల కేంద్రాల్లో5 మున్సిపాలిటీలతో పాటు కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీపీవో దేవకీదేవి, ఈడీఎం ఆనంద్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని నినాదాలు చేస్తున్న కళాకారులు

సిద్దిపేట టౌన్,జూలై 18 : తెలంగాణ ఉద్యమ కళాకారులకు ప్రభుత్వం సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలను ఇవ్వాలని కళాకారుల వేదిక నాయకులు పిన్నింటి దాసు డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ కళాకారులను గుర్తించి 550 మందికి ఉద్యోగాలను కల్పించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాంస్కృతిక సారథిలో అర్హులైన ఉద్యమ కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో కళాప్రసాద్, శ్రీనివాస్, గణేశ్, పరమేశ్వర్, యాదగిరి, సోమ నరేశ్, శ్యామ్ సుందర్ తదితరులు ఉన్నారు.

కెమికల్స్‌ను అతిగా ఉపయోగించొద్దు

హుస్నాబాద్‌టౌన్, జూలై 18 : మంచినీటిని శుద్ధిచేసే క్రమంలో వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు కెమికల్స్‌ను అతిగా ఉపయోగించవద్దంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న అన్నారు. సఫాయిఅప్నా బీమారిభగావో కార్యక్రమంలో గురువారం డిపోరోడ్డులోని వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులకు కృషిచేయాలని ఆమె సూచించారు. మున్సి పల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఇంజినీర్ రవికుమార్, జవాన్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

సిద్దిపేట అర్బన్, జూలై 18 : సిద్దిపేట పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. సిద్దిపేట పట్టణ శివారులోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు సిద్దిపేట పట్టణంలోని వెరిటాస్ అండ్ వర్చ్యూస్ కంప్యూటర్ కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాల్లో డీఎస్సీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్దిపేట పట్టణంలోని వెరిటాస్ అండ్ వర్చ్యూస్ పరీక్షా కేంద్రాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ మేరకు అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. మొత్తం రెండు పరీక్షా కేంద్రాల్లో 369 మంది అభ్యర్థులకు గానూ, 309 మంది అభ్యర్థులు హాజరై 60 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీపీ అనురాధ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మొక్కలను పంపిణీ చేస్తున్న కమిషనర్ గోల్కొండ నర్సయ్య

గజ్వేల్, జూలై 18 : పట్టణంలోని ప్రతి ఇంట్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. గురువారం వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని 1, 7, 17వ వార్డుల్లో ఇంటింటికీ మొక్కలు పంపి ణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్డు శాంపిల్స్ సేకరణ

గజ్వేల్, జూలై 18: మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు పరిధిలో రాజిరెడ్డిపల్లి పార్కికుంటపై వేసిన సీసీ రోడ్డు నాణ్యతలోపంతో ఉండడంతో గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా డీఈ శ్రీకాంత్, ఏఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీసీ రోడ్డు వేయడంలో కాంట్రాక్టర్లు సరైన నాణ్యత ప్రమాణాలు పాటించలేదని ఫిర్యాదు రావడంతో శ్యాంపిల్స్‌ను సేకరించామని వాటిని ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతలు పాటించకుండా వేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.వారివెంట కౌన్సిలర్ బాలమణి, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు శ్యాంపిల్స్‌ను సేకరిస్తున్న అధికారులు

రైల్వే గూడ్స్ షెడ్డును పరిశీలించిన రైల్వే అధికారులు

సిద్దిపేట, జూలై 18 : దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఆపరేషన్ మేనేజర్ నాగయ్య గురువారం సిద్దిపేట, గజ్వేల్ రైల్వే స్టేషన్‌లో టెర్మినల్‌లను తనిఖీ చేశా రు. సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో గూడ్స్ షెడ్‌లను తనిఖీ నిర్వహించి, అందులోని సౌకర్యాలు రేక్ లేన్, సీసీ ఉపరితలంతో పాటు రైల్వే ఫ్లాట్ ఫారం, అప్రోచ్ రోడ్, రాత్రిపూట పని చేసేందుకు హైమాస్ట్ లైట్లు తదితర అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట రైల్వే అధికారులు విద్యాధర్, అనిరుధ్ పామర్ పాల్గొన్నారు.

సిద్దిపేట రైల్వే స్టేషన్‌లో పనులను పరిశీలిసున్న దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఆపరేషన్ మేనేజర్ నాగయ్య

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కరాములు

సమావేశంలో మాట్లాడుతున్న చుక్కరాములు

సిద్దిపేట టౌన్, జూలై 18 : ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సమావేశం గురువారం జిల్లా కేంద్రం సిద్దిపేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి అనేక అంక్షలను విధించి, రేషన్ కార్డు ప్రాతిపాదికన రుణమాఫీ చేస్తామనడం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, కాముని గోపాల స్వామి, శశిధర్, ఎల్లయ్య, భాస్కర్, సత్తిరెడ్డి,కృష్ణారెడ్డి, రవికుమార్, యాదగిరి, శీరిష, రవీందర్, నవీన్, శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలి

చేర్యాల, జూలై 18 : రైతుల రుణమాఫీపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు అసెంబ్లీతో పాటు ప్రజావేదికలలో ప్రభుత్వాన్ని నిలదీయడంతో ఈ రోజు కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేస్తున్నదని బీఆర్‌ఎస్ నాయకుడు, రైతుబంధు సమితి జిల్లా మాజీ సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి కొర్రీలు లేకుండా రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

బెజ్జంకి, జూలై 18: రుణమాఫీ పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ జడ్పీటీసీ కనగండ్ల కవిత ఆరోపించారు. మండల కేంద్రంలో ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో చాలా మంది అర్హత గల రైతులను ప్రభుత్వం రుణమాఫీకి ఎంపిక చేయకపోవడం బాధాకరమన్నారు. జాబితాలో అర్హత గల రైతుల పేర్లు లేకపోవడంతో చాలా ఆందోళన చెందుతున్నరని, అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి రైతులకు న్యాయం చేయలని కోరారు. కొంత మంది రైతులను ఎంపిక చేసి రుణమాఫీ చేశామని, ప్రభుత్వం కోట్ల రూపాయాల యాడ్స్ ఇచ్చి రైతులను తప్పిదోవ పట్టిస్తుందన్నారు.

జాబితాలో పేరులేని రైతుల్లో ఆందోళన

సిద్దిపేట, జులై 18: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తూ విడుదల చేసిన తొలి జాబితాలో రూ. లక్షలోపు రుణాలు తీసుకున్న అనేక మంది రైతుల పేర్లు రాకపోవడంతో రైతులు ఆందోళనలు చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వ విడుదల చేసిన మార్గదర్శకాల్లో చెప్పిన విధంగా అనేక అంశాలను వర్తింపజేయడంతో చాలామంది పేర్లు జాబితాలో లేవు. ప్రధాన మంత్రి కిసాన్ యోజన నిబంధనలు వర్తింపజేయడం. ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారు, ప్రభుత్వ ఉద్యోగులకు రుణమాఫీ వర్తింపజేయకపోవడంతో చాలామంది రైతుల పేర్లు జాబితాలో లేకుండా పోయాయని రైతులు వాపోతున్నారు.

రుణమాఫీపై క్లారిటీ లేని ప్రభుత్వం

ఆందోళనలో రైతన్నలు

చేర్యాల, జూలై 18 : రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు రూ.2 లక్షలలోపు ఏకకాలంలో మాఫీ చేస్తామని ఎన్నికల ముందుకు ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు ఆవేదన చెందుతున్నారు. రేషన్‌కార్డు రుణమాఫీకి ప్రమాణికమని, కాదు పట్టాదారు పాసుపుస్తకం చాలు అనే ప్రకటనలో రైతులు ఆగమవుతున్నారు. వేలాది మంది రైతులు పట్టణంలోని వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటే కొద్ది మందికి మాత్రమే రుణమాఫీ అయినట్లు అధికారులు వాట్సాప్ గ్రూపుల్లో వేసిన పత్రాలను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. చేర్యాల, మండలంలో 1816 మంది, కొమురవెల్లి మండలంలో 1048 మంది, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో 2300 మంది రైతులకు లక్షలోపు రుణమాఫీ అవుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ఒకే కుటుంబంలో భార్య, భర్తలు లక్షలోపు రుణాలు తీసుకున్నప్పటికీ వారి పేర్లు మాఫీ పత్రాల్లో లేవు, కాగా గురువారం సాయంత్రం వరకు రుణాలు మాఫీ అవుతున్న రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడలేదని రైతులు వాపోయారు.

రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

సిద్దిపేట అర్బన్, జూలై 18 : పంట రుణమాఫీ జరిగిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు మండల పరిధిలోని మిట్టపల్లి రైతు వేదికలో కలెక్టర్ మనుచౌదరి, వ్యవసా య అధికారులు, మండల పరిధిలో ని పలు గ్రామాలకు చెందిన రైతులు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెకర్ మను చౌదరి మాట్లాడుతూ రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి, రైతులు

రాజద్రోహం కేసులు సిగ్గుచేటు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

గజ్వేల్, జూలై 18 : హక్కులపై పోరాటం చేస్తున్న వారిపై రాజద్రోహం కేసులు పెట్టడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గజ్వేల్‌లో సీపీఐ సాధారణ సమావేశానికి హాజరైన ఆయన స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగానికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. కొందరి చేతుల్లోనే ఉన్న దేశ సంపదను పేదలందరికీ చేర్చాలన్నదే తమ లక్ష్యమని అందుకు నిరంతర పోరాటం చేస్తామన్నారు. నల్ల చట్టాలపై 750మంది రైతులకు పొట్టన పెట్టుకున్న మోదీ ప్రజలకు క్షమపణ చెప్పగా, ఇప్పటి వరకు మద్దతు ధర చట్టం తీసుకురాకపోవడం సిగ్గుచేటన్నారు. అంతకు ముందు సీపీఐలో దయానంద్‌రెడ్డి, రాజే శం చేరగా కార్యక్రమంలో మంద పవన్, ప్రకాశ్‌రావు, శివలింగు కృష్ణ, వెంకట్రామిరెడ్డి, రంగారెడ్డి, చింత శ్రీను, జనార్దన్, మ ధు, నర్సింహులు, భిక్షపతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

ఐదేండ్లలోపు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి

చేర్యాల : ర్యాలీ నిర్వహిస్తున్న చైర్‌పర్సన్, అంగన్‌వాడీ సిబ్బంది

హుస్నాబాద్‌టౌన్, జూలై 18 : రెండున్నర ఏండ్ల నుంచి ఐదేండ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో జయమ్మ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నం, ఆకుకూరలు, గుడ్లు, పాలతోపాటు బాల అమృతం అందిస్తున్నామని బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో జయమ్మ కోరారు. కౌన్సిలర్లు బొజ్జ హరీశ్, దొడ్డి శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత ల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, జూలై 18 : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాలు (3, 6,11) ఆధ్వర్యంలో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా కేంద్రాల పరిధిలో పర్యటించి రెండున్నర సంవత్సరాల పిల్లలను గుర్తించి వారిని పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి,అంగన్‌వాడీ టీచర్లు తాటి పాముల కృష్ణవేణి, గుడాల శోభ, కాటం రేణుక, హెల్పర్ బాల్‌లక్ష్మి, ఆశవర్కర్లు నాగమణి, రమ, సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

బెజ్జంకి, జూలై 18 : చిన్నారుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ నాగరాణి కోరారు. మండల కేంద్ర పరిధిలోని పాపయ్యపల్లిలో గురువారం అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ పొట్లపల్లి జమున, సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా హరిబాబు

సిద్దిపేట టౌన్, జూలై 18 : సిద్దిపేట స్ఫూర్తి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, కోశాధికారిగా దూడం రాజు నియామకమయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ముఖ్యఅతిథి శ్యామ్ కుమార్, అధికారి అమర్నాథ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీధర్, మధు, మామిడాల శ్రీనివాస్, సంతోశ్, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై18 : వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన వానరానికి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మద్దూరు మండలంలోని లద్నూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మద్దూరు–లద్నూర్ గ్రామాల మధ్య ఓ వానరాన్ని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందింది. మృతి చెందిన వానరానికి ఎఎస్సై జిల్లా జగదీశ్వర్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు పరశురాములు, సురేశ్ అంత్యక్రియలు నిర్వహించారు. వానరానికి అంత్యక్రియలు నిర్వహించిన పోలీసులను పలువురు అభినందించారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

సగం మందికే రుణమాఫీ

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ ఎస్ నాయకులు

సిద్దిపేట, జులై 18 : కాంగ్రెస్ పార్టీ పంట రుణమాఫీ పేరుతో విడుదల చేసిన జాబితాలో అనేక మంది రైతుల పేర్లు లేవని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మెరుగు మహేశ్, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి అన్నారు. గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఏమాత్రం స్పందన లేకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ పార్టీ తెచ్చిన ఒత్తిడి ఫలితంగానే రుణమాఫీ చేస్తున్నారని, అది కూడా పేరుకే రుణమాఫీ అని రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతులు ఎందరో ఉన్నారని అన్నారు. నాయకులు శ్రీకాంత్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి డ్రాయింగ్‌లో నాగపురి విద్యార్థి ప్రతిభ

చేర్యాల, జూలై 18 : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన డ్రాయింగ్ పోటీల్లో (పోస్టర్ మేకింగ్)లో మండలంలోని నాగపురి జడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న భీమనపల్లి దీక్షిత జిల్లా స్థాయిలో ప్రతిభ చూపించి తృతీయ బహుమతి అందుకుంది. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దీక్షితతో పాటు గైడ్ టీచర్ స్వర్ణకుమార్,లక్ష్మణ్‌లను హెచ్‌ఎం ఎలికట్టె అయిలయ్య, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, పద్మ, నిరుపమ, విజయ్ కుమార్, మనోజ్ కుమార్, ప్రకాశ్ రెడ్డి, మాధవి, కనకలింగం, రాజేశ్వరి, తోటి విద్యార్థులు అభినందించారు.

జిల్లా స్థాయి అవార్డు అందుకుంటున్న దీక్షిత

హామీలను వెంటనే అమలు చేయాలి

హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా

హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశకార్యకర్తలు

హుస్నాబాద్, జూలై 18 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆశకార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆశకార్యకర్తలు హుస్నాబాద్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలకు ముందు ఆశ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అంతే కాకుండా ఫిబ్రవరి 9న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, రూ.50లక్షల ఇన్సూరెన్స్ ఇప్పించాలని, రూ.10వేల పింఛన్ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెన్ఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నాగెల్లి పద్మ, జి పద్మ, జిల్లా సహాయ కార్యదర్శి శ్యామల ప్రియాంక, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీపై సమగ్ర విచారణ చేపట్టాలి

చేర్యాల, జూలై 18 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆలయంలో హుండీ లెక్కింపు సందర్భంగా బంగారు ఉంగరం, గొలుసు చోరీ యత్నంపై సమగ్ర విచారణ చేపట్టాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆలయాన్ని వీహెచ్‌పీ,భజరంగ్‌దళ్ నాయకులు సందర్శించి ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌ను కలిసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మెడ్ విభాగ్ సహ కార్యదర్శి గ్యాదరి రాజారామ్, సిద్దిపేట జిల్లా కార్యదర్శి బుస్స నరేశ్, జిల్లా కన్వీనర్ ఎక్కలదేవి శ్రీనివాస్, చేర్యాల కన్వీనర్ రాజేందర్, కొమురవెల్లి కన్వీనర్ భరత్, చంద్రారెడ్డి, సందీప్ తదితరులు ఉన్నారు.

ఏఈవోను కలిసిన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

ఆలయ అభివృద్ధి, భక్తుల సేవే లక్ష్యం

చేర్యాల, జూలై 18 : కొమురవెల్లి ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు సేవలు అందించడమే తన లక్ష్యమని ఏఈవో గంగా శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆలయంలో ఇటీవల జరుగుతున్న ఘటనలపై ఆయన విలేకరులతో మాట్లాడారు. హుండీ లెక్కింపు సందర్భంగా బంగారు గొలుసు చోరీకి తాను యత్నించినట్లు వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, తనపై పలువురు నిరాధారమైన ఆరోపణలు చేయిస్తున్నట్లు తెలిపారు. దర్శనాల పాసులను ఆలయ ఈవో బాలాజీ ఆదేశాల మేరకు తాను జారీ చేశానని, ఉద్యోగ జీవితంపై బురద చల్లేందుకు కొందరు యత్నిస్తున్నారని, త్వరలో తనపై వచ్చే ఆరోపణలపై కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

నేటి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

తొగుట, జూలై 18 : మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై మరో పోరాటం చేయడానికి ఎమ్మార్పీఎస్ సిద్ధంగా ఉందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 19న శుక్రవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని యాదగిరి గుట్టలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సును నాయకులు హాజరైన విజయవంతం చేయాలని కోరారు.

సీసీరోడ్డునిర్మించాలని కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రసాద్

సీసీరోడ్డు నిర్మించాలని కమిషనర్‌కు వినతి

హుస్నాబాద్‌టౌన్, జూలై 18 : ఏండ్లతరబడి ఇండ్లు నిర్మించుకున్న తమకు సీసీ రోడ్డు నిర్మించలేదంటూ పట్టణంలోని 14వ వార్డుకు చెందిన దామెర ప్రసాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. నాగారం రహదారిలోని తమ కాలనీకి సీసీరోడ్డు నిర్మించకపోవడంతో మట్టిరోడ్లు గుంతలుగా మారి నడిచేందుకు సైతం ఇబ్బందులు ఎదురవుతాయని కమిషనర్‌కు మొరపెట్టుకున్నారు. కాలనీని పరిశీలించి సీసీ రోడ్డు నిర్మాణం చేసేందుకు కృషిచేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 18 : కుకునూరుపల్లి మండలంలోని లకుడారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సీఐ లతీఫ్‌ఖాన్, షీటీమ్ ఏఎస్సైలు శ్రీరాములు, సువర్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలికలు, మహిళల రక్షణకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాలతో పాటు సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో డయల్ 100కు ఫోన్ చేయలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

హరీశ్ రావు కృషితో విద్యా క్షేత్రంగా సిద్దిపేట

సిద్దిపేట, జులై 18 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు కృషితో సిద్దిపేట విద్యా క్షేత్రంగా మారిందని బీఆర్‌ఎస్వీ నాయకులు ఇరుగంటి రమేశ్ మెరుగు మాధవ్ అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల వద్ద విద్యార్థులకు స్వాగతం చెబుతూ బీఆర్‌ఎస్వీ స్వాగత బ్యానర్లను ఏర్పాటు చేశారు. నాయకులు వంశీ, రాములు, సాయి చరణ్ గౌడ్, చందు, ఎండీ సోహెల్, విష్ణు వర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బీరువా అందజేత

సిద్దిపేట టౌన్, జూలై 18 : సిద్దిపేట వనిత క్లబ్ ఆధ్వర్యంలో భారత్ నగర్ వృద్ధాశ్రమానికి దాత నాగరాణి సహకారంతో గురువారం బీరువాను అందజేశారు. కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు వాణి, వాసవీక్లబ్ ప్రతినిధులు నేతి వేణు కుమార్, మాంకాల నవీన్ కుమార్, శ్రీనివాస్, వీరేశం, మల్లికార్జున్ ఉన్నారు.

తాగునీటికి తప్పిన ఇబ్బందులు

కొమురవెల్లిలో బోర్ వేయిస్తున్న ఆంజనేయులు

కొమురవెల్లి, జూలై 18 : కొమురవెల్లి మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో కొంత కాలంగా నీళ్లు సరిగ్గా రాకపోవడంతో గురువారం కొమురవెల్లి యువ నాయకుడు గొల్లపల్లి ఆంజనేయులు సొంత ఖర్చులతో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో నీళ్లు సరిగ్గా రావడం లేదని దీంతో మహిళలు ఇబ్బందులు పడుతుండటం గమనించి బోర్ వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్కలదేవి రాజు, కోరిమి సత్తయ్య, పుట్ట నరేశ్, సార్ల నర్సింహులు, మేడికుంట రవి, జనార్దన్, వెంకటేశ్, సతీశ్, పరశురాములు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మోతీలాల్‌కు డాక్టరేట్‌పై తండా వాసుల హర్షం

అక్కన్నపేట, జూలై 18 : మండలంలోని పంతుల్‌తండాకు చెందిన కే (కరంటోతు) మోతీలాల్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ పట్టా అందుకోవడంపై గురువారం తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. మోతిలాల్ డాక్టరేట్ సాధించాలనే లక్ష్యంతో ఖాసీంపూర్(ఉత్తర్‌ప్రదేశ్) గ్లోకల్ యూనివర్సిటీ నుంచి డిపార్ట్‌మెంట్ అఫ్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో రిసర్చ్ స్కాలర్ చేరి డాక్టరేట్ పొందాడు. మారుమూల గిరిజన తండాకు చెందిన మోతీలాల్ ఇంజినీరింగ్‌లో డాక్టరేటు సాధించడంపై తండావాసులు అభినందిస్తూ, హర్షం వ్యక్తం చేశారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నేను, B.భాస్కర్‌చారి, తండ్రి: వెంకట రాజయ్య, నివాసం: ఇం.నెం. 4–68, గజ్వేల్ టౌన్, గజ్వేల్ (మం), సిద్దిపేట (జి), తెలంగాణ, ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, సిద్దిపేట (జి), గజ్వేల్ (మం), గజ్వేల్ టౌన్ వద్దగల ఇం.నెం. 7–101/A కలిగిన నా యొక్క ఇంటికి సంబంధించిన ఒరిజినల్ లింక్ & సబ్ లింక్ డాక్యుమెంట్లు అనగా డాక్యుమెంట్ నెం. 5351/2012, 3036/2012, 402/2011, 7582/2004 మరియు 243/1982 పోయినవి. ఎవరికైనా దొరికినచో సంప్రదించండి: **9866826391.**